భీమేశ్వర స్వామిని దర్శించుకున్న డిఐజి

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరస్వామి ఆలయాన్ని డిఐజి జివిజి.అశోక్, ఎస్‌పి సతీష్‌కుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఇఒ బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. వారికి ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి లతా కుమారి, స్థానిక సిఐ సురేష్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న డిఐజి, ఎస్‌పి

ప్రత్తిపాడులో పాగా వేసేదెవరు?

- రగిలిపోతున్న సిట్టింగ్ ఎంఎల్‌ఎ
- వైసిపిలో వీడని విభేధాలు
- టిడిపి అభ్యర్థి ఖరారుపై కొనసాగుతున్న సస్పెన్స్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో మెట్ట రాజకీయాలు ఆసక్తిని కలిగిస్తున్నాయి. ప్రతీ ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గ రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలు, నేరుగా అసంతృప్తులు, అధికార ప్రతిపక్షాల మధ్య, మాటల యుద్ధం ఇక్కడ చర్చనీయాంశాలుగా ఉంటాయి. ముద్రగడ కుటుంబం ఇక్కడ ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించగా పర్వత కుటుంబం నాలుగు, వరుపుల కుటుంబం నుంచి మూడుసార్లు ఎంఎల్‌ఎలుగా పని చేశారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు ఉన్న ముద్రగడ పద్మనాభం నాలుగుసార్లు, ఆయన తండ్రి వీర రాఘవరావు రెండు సార్లు ఎంఎల్‌ఎగా పని చేశారు. పర్వత కుటుంబం నుంచి ఇప్పటి వరకు పర్వత బాపనమ్మ, పర్వత గుర్రాజు, పర్వత సుబ్బారావు, పర్వత చిట్టిబాబు నలుగురు ఎంఎల్‌ఎలు పదవులు చేపట్టగా, వరుపుల కుటుంబం నుంచి సుబ్బారావు, వరుపుల జోగిరాజా శాసనసభ్యులుగా పని చేశారు.

గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పర్వత పూర్ణచంద్రప్రసాద్, టిడిపి నుంచి వరుపుల రాజా బరిలో ఉండగా హోరాహోరీ పోరులో పర్వత విజయం సాధించారు. అయితే ప్రసాద్‌పై సొంత వర్గం వారే తీవ్ర వ్యతిరేకత చూపారు. సొంత పార్టీ కేడర్ ఆయనను బహిరంగంగానే విమర్శిస్తూ వచ్చారు. ఆయన తీరు నచ్చక కొందరు ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా రాజీనామాలు సైతం చేశారు. అధిష్ఠానంకు ఫిర్యాదులు కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే పలు సర్వేలు, వ్యతిరేకత నేపథ్యంలో వైసిపి ప్రసాద్‌ను తప్పించి మాజీ ఎంఎల్‌ఎ వరుపుల సుబ్బారావును ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. ప్రత్తిపాడు వైసిపి నియోజకవర్గంలో ముసలం నెలకొనడంతో కొంతమంది కేడర్ పర్వత వైపు నుంచి వరుపుల వైపుకి మళ్లారు. ఈ నేపథ్యంలోనే 2024 ఎన్నికల్లో పర్వత తనకు ఎలాగైనా సీటు దక్కుతుందని నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. ప్రజల్లో తనకు

వ్యతిరేఖత లేదని చెప్పుకునే ప్రయత్నంలో భాగంగా నెల రోజుల క్రితం ప్రజా దీవెన పేరుతో జనంలో తిరుగుతున్నారు. తన కేడర్ అసంతృప్తి చెందకుండా వచ్చే ఎన్నికల్లో సీటు లక్ష్యంగా సాగుతున్నారు. "నా పనితీరు, కొత్త ఇన్‌ఛార్జ్ పనితీరును సీఎం బేరీజు వేసుకుంటారు. నన్ను కాదని వేరొకరికి టికెట్ ఇస్తారని అనుకోవడం లేదని" పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఈ సందర్భంగా ఆయన చెప్పుకొస్తున్నారు. మరోవైపు వైసిపిపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతను పక్కకు మలిచి సంక్షేమ పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా వరుపుల సుబ్బారావు అడుగులు వేస్తున్నారు. అయితే ఇక్కడ వైసిపిలో ఉన్న వర్గపోరు ఆ పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకుల అంచనా. ప్రసాద్ మరోసారి బరిలో ఉండే అవకాశం ఉండగా వరుపుల గెలుపు అంత ఈజీ కాదని కూడా విశ్లేషిస్తున్నారు. తన సమీప బంధువు కావడంతో సుబ్బారావుకు ఇన్‌చార్జ్‌గా అవకాశం ఇవ్వడం వెనుక ఎంఎల్‌సి అనంత బాబు ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇక్కడ వైసిపి ఏ మేరకు విజయం సాధిస్తుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇంకో వైపు కొన్ని రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో వరుపులను మార్పు చేసి మరొకరికి అవకాశం ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది.

డిసిసిబి మాజీ అధ్యక్షుడు వరుపుల రాజా అకాల మరణంతో ఆయన సతీమణి సత్యప్రభ ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తున్నారని టిడిపి శ్రేణులు చెబుతున్నాయి. సానుభూతి కలిసి వస్తుందని, వైసిపి వ్యతిరేఖ ఓట్లు తమ విజయానికి సునాయాసంగా అవకాశం ఉంటుందని ఆమె భావిస్తున్నారు. అయితే ఇటీవల టిడిపి అధిష్ఠానం అత్యధిక సీట్లు ప్రకటించినప్పటికీ ప్రత్తిపాడు సీటుని మాత్రం ప్రకటించలేదు. జనసేనలోకి ముద్రగడ వస్తే ఆయన తనయుడు గిరిబాబుకి సీటు పొత్తులో భాగంగా ఇక్కడే ఇచ్చే అవకాశం ఉందని నిన్నమొన్నటి వరకూ ప్రచారం జరిగింది. అయితే ముద్రగడ ఆ పార్టీలోకి చేరే అవకాశాలు పూర్తిగా లేవు. దాంతో సత్యప్రభకు లైన్ క్లియర్ అయిందని ఆమె శ్రేణులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ నేతల ద్వారా ప్రలోభాల పర్వం ఎక్కువగా ఉంటుందని, మహిళ కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేయాలంటే ఉన్న కొన్ని ఇబ్బందులు దృష్ట్యా ఆమె విజయ అవకాశాన్ని ఏ విధంగా చేరుకోగలదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇలా ఈ నియోజకవర్గ రాజకీయాలు ఆశక్తికరంగా మారడంతో వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే చర్చ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది.

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

బ్యాంకు దోపిడీ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ ఏడాది ఫిబ్రవరి 7న ప్రతిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలోని ఎస్‌బిఐలో జరిగిన దోపిడి కేసులో నలుగురు ముద్దాయిలను పోలీసులు అరెస్టు చేశారు. దోపిడీకి సూత్రదారుడితోపాటు, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరి నుంచి రూ.30,69,700 విలువగల బంగారం, నగదును రికవరీ చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం ఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి ఈ బ్యాంకు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈ ముఠా లోని నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. దోపిడీకి గురైన కెజి బంగారు అభరణాలు, రూ.1,19,700 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. మిగిలిన ముగ్గురు నిందితుల అరెస్టు కోసం వివిధ రాష్ట్రాలల ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లలితకుమారి ఆధ్వర్యంలో బ్యాంకు దోపిడీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా ఈ నేరం చేసినట్టుగా ప్రాథమికంగా గుర్తించి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు. ఈ దోపిడీతో సంబంధం ఉన్న దన్వీర్ అనే మేస్త్రి, అక్షయ్, హరీష్, వైభవ్ అనే నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఈ దోపిడీకి సంబంధించిన కేసును చేధించేందుకు ఏర్పాటు చేసిన పోలీసు బృందాలు అలుపెరగని కృషే కారణమన్నారు. కేసు దర్యాప్తు అధికారి డిఎస్‌పి కె.లతాకుమారి, ట్రైనీ ఐపిఎస్ నవజ్యోతి మిశ్రా, ట్రైనీ డిఎస్‌పి సాయిఈశ్వర్, ఇతర అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, పెద్దాపురం సబ్-డివిజినల్ పోలీస్ ఆఫీసర్ కె.లతాకుమారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి చవ్వాకుల రామకోటేశ్వర రావు, ప్రత్తిపాడు సిఐ ఎం.శేఖర్ బాబు, రౌతులపూడి ఎస్ఐ ఎండి అబ్దుల్ నబీ, ప్రత్తిపాడు ఎస్ఐ ఎం.పవన్ కూమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

దివీస్ పరిశ్రమ నుంచి కలుషిత జలాలు సముద్రంలోకి పోయేందుకు వేసిన పైపులైన్లు తొలగించాలని మత్స్యకారులు చేపట్టిన ఆందోళన గురువారం కొనసాగింది. కోనపాపేట ప్రధాన రోడ్డులో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు మాట్లాడుతూ దివిస్ పరిశ్రమ ద్వారా వేసిన పైపులైన్లు తొలగించకపోతే మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. తద్వారా మత్స్యకార జీవనానికే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చేసిన ఆందోళనను విరమించేందుకు పైపులైన్‌ను తొలగిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అయితే నాడు హామీ ఇచ్చిన అధికారులు నేడు కన్పించడం లేదన్నారు. తమ భయాన్ని, ఆందోళనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వివరించామని, అయినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. దివిస్ పరిశ్రమ నుంచి పైపులైన్లు తొలగించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మత్స్యకారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోనపాపేట మత్స్యకారులతోపాటు తొండంగి మండలానికి చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

నిరసనను కొనసాగిస్తున్న మత్స్యకారులు

రెగ్యులర్ ఉత్తర్వులపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ

వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పారా మెడికల సిబ్బందిని రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు కె.జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు జివి.రమణ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది అయిన స్త్రీ, పురుష ఆరోగ్య కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ గురువారం జిఓఎంఎస్ నెం.30, జిఓఎంఎస్ నెం 31 ద్వారా ఆదేశాలను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ ఉత్తర్వుల పట్ల వారు హర్షం ప్రకటిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కొన్ని చిన్న చిన్న కారణంల చేత మొదటి విడతగా నేడు ఇచ్చిన జాబితాలలో లేని వారిని కూడా సత్వరమే రెగ్యులర్ చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని యుఎంహెచ్ఐయు (సిఐటియు)గా గత 23 సంవత్సరాల నుంచి అలుపెరగని పోరాటాలను నిర్వహించిందన్నారు. దాని ఫలితంగా కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది ప్రస్తుతం రెగ్యులర్ అయ్యారన్నారు. మిగిలిన కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు అందరిని రెగ్యులర్ చేయాలని, ఈ లోపు నూరు శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని వారు కోరారు.

అవార్డును అందుకుంటున్న గోపిదేవి

సిరి సంస్థకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

గత 30 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మానసిక వికలాం గులకు ఉచితంగా ప్రత్యేక విద్య, ఉపాధి కల్పిస్తున్న సామర్లకోట సిరి మానసిక వికలాంగుల పాఠశాలకు ఇండియాలో 2024 టాప్ 20 బెస్ట్ ఎన్‌జిఒ అవార్డు లభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల న్యూఢిల్లీలోని హయత్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ టాప్ 20 బెస్ట్ ఎన్‌జిఒ అవార్డును నిర్వాహకులు రోహన్ మదన్ శివాని కపూర్లు అందచేశారు. ఈ సందర్భంగా సిరి సంస్థ డైరెక్టర్ డి.గోపిదేవి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మానసిక శారీరక వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ స్పీచ్, థెరపీ బిహేవియర్ మోడి ఫికేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు రావడం ఆనందకరంగా ఉందన్నారు. ఈ అవార్డుతో సంస్థ సిబ్బంది బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇప్పటివరకు తమ సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థల నుంచి 12సార్లు ఉత్తమ సేవా అవార్డులు అందుకోవడం జరిగింద న్నారు. తమ సంస్థ సేవలను కొనియాడుతూ సిఎం జగన్ లేఖ పంపినట్లు చెప్పారు. ఉత్తమ ఎన్‌జిఒ అవార్డు అందుకున్న సందర్భంగా పలువురు గోపిదేవిని అభినందించారు.

కార్టూ'నిజం'



మహిళలు నిర్ణయాత్మక శక్తులుగా ఎదగాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరగాల్సిన మహిళా దినోత్సవం రోజునే మహాశివరాత్రి పండుగ జరుగుతున్న నేపథ్యంలోనే మహిళా దినోత్సవాన్ని గురువారమే అత్యధిక ప్రాంతాల్లో నిర్వహించారు. **కాకినాడ** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. గురువారం సిఎం జగన్ అనకాపల్లి జిల్లా కశింకోట మండలం, పిసినికాడలో నిర్వహించిన కార్యక్రమంలో స్వయం సహాయ సంఘ మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం 4వ విడత ఆర్థిక సాయాన్ని అందిస్తూ బటన్ నొక్కారు. కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రచారంలో కలెక్టర్‌తోపాటు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహిళా దినోత్సవాన్ని గుర్తు చేస్తూ మాట్లాడారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన మహిళలు కుటుంబం లోనూ, సమాజంలోనూ నిర్ధేశక శక్తులుగా నిలుస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహంతో ఆ దిశగా మహిళలు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కె శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, ఎస్‌సి కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ ఇడి జె.సత్యవతి అదికారులు పాల్గొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్-ఎస్, ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ భారత దేశంలో స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సాంకేతికంగా మానసికంగా దృఢంగా ఉన్న స్త్రీ శారీరకంగా కూడా దృఢంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్, సత్య సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, టైక్వాండో ట్రైనర్ నాగదేవి బిరుద మాట్లాడారు. కళాశాల అధ్యాపకేతర సిబ్బందికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సాయంతో మల్టీ విటమిన్ కేల్షియమ్ సిరప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, దివాకర రావు, వాలంటీర్లు పాల్గొన్నారు. అలాగే జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఐద్వా, దిశ మహిళా పోలీస్ విభాగం, ఎస్ఎఫ్ఐల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు ఐక్య ఎపి కోఆర్డినేటర్, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వసంతలక్ష్మి అధ్యక్షత వహించారు. పిఎస్ఎన్ కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ విజయభక్ష్, దిశా మహిళా పోలీస్ విభాగం ఎస్ఐలు లక్ష్మీకాంతం, నాగకళ్యాణి, మహిళా శిశు సంక్షేమం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శైలజ, ఐద్వా నాయకురాలు సిహెచ్.రమణి, ఎస్ఎఫ్ఐ నాయకుడు సూరిబాబు మాట్లాడారు. **గండేపల్లి** మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి కె.ప్రవీణ, శిశు, మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రతి విద్యార్థినీ సమాజంలో జరిగే అసమానతలపై, వివక్షలపై నోరు విప్పాలని పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. సత్యనారాయణ, కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్ పాల్గొన్నారు. అలాగే సురంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎస్‌టివిఎస్. కుమార్, తదితరులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని గురజనాపల్లి హైస్కూల్లో హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎంతోపాటు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాద రావు మాట్లాడారు. నేటికీ సమాజంలో మహిళలు వివక్షతకు గురౌతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయినులు పి.మాణిక్యాంబ, పి.భవాని, సిహెచ్. పద్మావతి, ఎం.ప్రభారాణి, కె.లక్ష్మీ, డి.వరలక్ష్మీలను సత్కరించారు. **కాకినాడ రూరల్** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు రాధా మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నారీ పురస్కార్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ ఎస్.ప్రసన్న, క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ ప్రశాంతి, శ్యామ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శైలజ, లక్ష్మీ డెంటల్ అధినేత డాక్టర్ ప్రవళిక పాల్గొని మాట్లాడారు. అలాగే మండలంలోని తూరంగి, అల్లూరి సీతారామరాజు కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త సిహెచ్.విజయ అధ్యక్షతన మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బలగం లత, ఎంవిఎల్ డిజైనర్ అధినేత ఎం.వీరలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయం 5 కార్యదర్శి రేవతి, మహిళా పోలీసు దుర్గా నీరజ, శుభారాణి, శాంతలక్ష్మి, తెల్గాప్రు గిరిజ, తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పవరం గ్రామంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సెట్రాజ్, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ (హెన్) ప్రాజెక్ట్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిఎన్.మూర్తి, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ,. సెట్రాజ్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎవిఎన్ఎస్.మూర్తి మాట్లాడారు. సిడిపిఒ వై.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకట్, సత్య స్కాన్స్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ డాక్టర్ కాద ప్రదీప్ చైతన్య, సెట్రాజ్ మేనేజర్ జెఎస్‌వి.కాశీ విశ్వేశ్వరరావు, చైల్డ్ ఫండ్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **తాళ్ళరేవు** మండలంలో మండల యూటిఎఫ్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. సిడిపిఒ ఒ..మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపిపిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు మంగాయమ్మ, ఒ.ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే జడ్‌పి హైస్కూల్లో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మండల సహాధ్యక్షురాలు జె.నీరజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.తాతారావు, ప్రధాన కార్యదర్శి చెక్క త్రిమూర్తులు, గోపి సత్యనారాయణ, వీరేంద్ర, కట్టా ఈశ్వరరావు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా దినోత్సవ సభ ఎంపిడిఒ ఉషారాణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకె సత్యవతి, ఇఒపిఆర్‌డి రాజశేఖర్, మండల కోఆప్షన్ సభ్యులు శేషు కుమారి, ఎంపి టిసి సభ్యులు పోకనాటి నాగలక్ష్మి, నల్లల సూర్య కుమారి, కాలే అనురాధ, జాగు వీరభద్రరావు, శైల గణేష్, నల్లల గోవిందు, పోకనాటి దుర్గారావు పాల్గొన్నారు.

మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

మహిళా కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి - కాకినాడ

మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకుండా పోతుందని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మతోన్మాదం మహిళల హక్కులకు ప్రధాన శత్రువని, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా మహిళలు నిరంతర పోరాటం నిర్వహించడం ద్వారా మాత్రమే సమాన హక్కులు సాధించుకోగలమని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మాట వరసకు మాత్రమే మహిళా సాధికారత అనే పదాన్ని వాడతున్నాయని, డబ్బులు పంచడమే మహిళా సాధికారతా అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో పని ప్రదేశాల్లో పురుషుల కంటే తక్కువ వేతనాలు మహిళలకు చెల్లిస్తున్నారని, ఆక్వా, జీడిపిక్కల పరిశ్రమలలో మహిళలకు కనీస చట్టాలైన పిఎఫ్, ఇఎస్ఐ రక్షణ పరికరాలు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలకు పరిపాలనలో కూడా సగభాగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెక్క రమణి, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గాదేవి మాట్లాడుతూ గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, యానిమేటర్లను ప్రభుత్వాలే దోపిడీ చేస్తుంటే సమాన హక్కుల కోసం పోరాడటం మినహా మరొక దారి లేదన్నారు. అంగన్‌వాడీ సమ్మెలో రాష్ట్ర మహిళలపై పోలీసుల ద్వారా అకృత్యాలకు జగన్ ప్రభుత్వానికి ఉన్న హక్కేమిటని, కనీస వేతనాలు అడిగే హక్కు అంగన్వాడీలకు లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, నగర కార్యదర్శి భారతి, రెడ్డి సత్యవతి, మలకా నాగలక్ష్మి, చెక్కల వేణి, అంగన్‌వాడీ సంఘం జిల్లా కోశాధికారి రమణమ్మ, నగర కార్యదర్శి జ్యోతి, చామంతి, నాగమణి, దాడి బేబి, రాజేశ్వరి, ఎస్తేరురాణి, వీరవేణి తదితరులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి



ఆదిత్యలో వృద్ధులకు మందులను అందిస్తున్న నిర్వాహకులు


కాకినాడ రూరల్ తూరంగిలో మాట్లాడుతున్న లత

అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన

ప్రజాశక్తి - అన్నవరం

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రసాద్ పథకంలో రత్నగిరిపై చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గురువారం ఈ ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమం కొండపైన ఇఒ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపి వంగా గీత, ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల పర్యవేక్షణలో భక్తులకు ఉపయోగపడే అన్నదానం భవనం, దర్శనం క్యూ లైన్ కాంప్లెక్స్, సులాబ్ కాంప్లెక్స్ వంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఇఒ రామచంద్రమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండ సభ్యులు, దేవస్థానం అధికారులు, పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవ సభలో ఎంపి, ఎంఎల్‌ఎ, ఇఒ

సచివాలయాల ద్వారా పరిపాలనా సౌలభ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గ్రామ సచివాలయాల ద్వారా పరిపాలనా సౌలభ్యం మరింత మెరుగుపడిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని తిరుమాలి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్వత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వివిధ ధ్రువపత్రాలు పొందడంతోపాటు వివిధ ప్రభుత్వ పనులు మరింత చేరువయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సూతి వీరకృష్ణప్రసాద్, కునపురెడ్డి సుబ్బారావు, బుద్ధ సూర్యప్రకాశ్రావు, ఎంపిటిసి సభ్యులు పసల సూరిబాబు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ పూర్ణచంద్రప్రసాద్

నేరాలు ఘోరాలు

దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్ ఫార్మర్‌లో రాగివైరు చోరీ

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని చిట్యాల గ్రామంలో గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్ ఫార్మర్ పగులగొట్టి అందులోని రాగివైరును కాజేశారు. చిట్యాల గ్రామానికి చెందిన గద్దే శ్రీనివాసరావు, యుగంధర్‌లకు చెందిన పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పగుల గొట్టి రాగివైరును దొంగిలించుకుపోయారు. గురువారం పొలానికి వెళ్లిన రైతులు దీన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ట్రాన్స్ ఫార్మర్ విలువ రూ.90 వేలు ఉంటుందన్నారు. కొంత కాలంగా చిట్యాల, పెద్దాపురం గ్రామాల పొలాల్లో మోటార్ వైర్లుదొంగిలించినట్లు రైతులు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

వెలిచేరులో ఇటీవల అదృశ్యమైన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన చిట్టిమేను శ్రీనివాస్ ఈ నెల 4న ఉదయం వెలిచేరు కాలువ రేవుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు కాలువ గట్టు వద్ద ఉన్న చెప్పులను గుర్తించారు. ప్రమాదవశాత్తు కాలువలో మునిగిపోయి ఉంటాడని భావించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. గురువారం ఆత్రేయపురం వద్ద కాలువలో మృతదేహం లభ్యమైంది. భౌతికకాయం శ్రీనివాస్‌దిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

స్వీట్‌స్టాల్స్‌లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని దుళ్ల గ్రామంలో నాలుగు స్వీట్ స్టాల్స్‌పై విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దత్తసాయి స్వీట్ స్టాల్, సిరి వైభవ స్వీట్స్ అండ్ డైరీ, శ్రీ వెంకటసాయి స్వీట్ స్టాల్, శ్రీ లక్ష్మీ స్వీట్ స్టాల్ యజమానులు ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని, వారికి నోటీసులు జారీ చేశామని రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కెఎస్‌ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. కిచెన్‌లో శుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు. ఒక స్వీట్ స్టాల్‌లో అనుమతిలేని తూకపు యంత్రాన్ని ఉపయోగించడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, భార్గవ మహేష్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు .

కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురి అరెస్ట్

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం సింగరాజుపాలెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. గురువారం గ్రామంలో ఓ వ్యక్తి దినకార్యం జరిగింది. చనిపోయిన వ్యక్తికి కోళ్ల పెంపకంపై మక్కువ ఎక్కువ. ఈ నేపథ్యంలో ఆయన ఆత్మ శాంతి కోసం కొంత మంది గ్రామస్తులు కోడిపందేలు నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

అనుమానాస్పదస్థితిలో వద్ధుడు మతి చెందిన ఘటన గురువారం జరిగింది. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన పెర్నాడ కృష్ణారావు(60) గోపాలపురం వచ్చి మధ్యాహ్నం నడుచుకుంటూ ఇంటికి బయలుదేరాడు. వేళ్లచింతలగూడెం శివారుకు వచ్చేసరికి విగతజీవిగా పడిఉన్నాడు. వడదెబ్బతో మృతి చెందినట్టు అనుమానిస్తున్నారు.

ఏప్రిల్ 28న బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - యానాం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని యానాంలో మొదటి సారిగా పుదుచ్చేరి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్లు బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చేతుల మీదుగా ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దుగ్గుదుర్తి మనోజ్ కుమార్, మూదే హరిచంద్ర, మహ్మద్ ఫిరోజ్ పాల్గొన్నారు.

ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

ఘనంగా నారాయణ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

వార్షికోత్సవ వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

కాకినాడ నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాంబమూర్తినగర్ సూర్య కళామందిర్ ప్రాంగణంలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో థర్డ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి. కమలాదేవి పాల్గొని మాట్లాడారు. నారాయణ స్కూల్ చాలా గొప్పగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందకరమని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ స్థాయి ధీటుగా నారాయణ స్కూల్‌ను 23 ఏళ్లుగా నడిపించడం సాధారణ విషయం కాదన్నారు. తరగతి గదిలో విద్యార్థులందరూ నెంబర్ వన్ విద్యార్థులుగా ఎదగలేరని, క్లాసుల్లో శ్రద్ధగా పాఠాలు విని ఎవరైతే పరీక్షల్లో దాన్ని పూర్తిగా అర్థం చేసుకునే రాస్తారో వారే నెంబర్ ఒన్‌గా నిలుస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి నెంబర్వన్‌గా ఉండాలంటే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. కరెస్పాండెంట్ టిఎస్‌వి నారాయణ మాట్లాడుతూ ఈ స్కూలు నడిపించడానికి కారణం నేను చదువుకున్న రోజుల్లో మా ఉపాధ్యాయులే కారణమని అన్నారు. వారి ప్రోత్సాహంతోనే తాను ఉపాధ్యాయ రంగాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యారంగంలో మహా విద్యాసంస్థల నుంచి ఒక ప్రత్యేక మార్కు తీసుకురావాలని అలా తీసుకురావడానికి 23 సంవత్సరాలుగా ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కాకినాడ నగరంలో మా స్కూలుకి ఒక ప్రత్యేకత ఉందని, చదువుతోపాటు అనేక విషయాల్ని మా స్కూల్లో విద్యార్థులకు తెలియజేస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా చదువుకోవడం ఎలా అనే విషయాలపై నిరంతరం మా అధ్యాపకు బృందం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి.సునీల్‌కాంత్‌కుమార్, గీతం స్కూల్ కరస్పాండెంట్ సుజ్ఞాన్, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లీదండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కురసాల

మండలంలోని తిమ్మాపురం గ్రామం లో గురువారం అంబేద్కర్ కమ్యూనిటీ భవనాన్ని ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ప్రారంభించారు. ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిబ్బన్ కత్తిరించి ఆయన అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రధాన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పాలన సాగుతుంద న్నారు. దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి కృషితో రాష్ట్రంలో ఏర్పాటు అయ్యిందన్నారు. అనంతరం తిమ్మాపురంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. అవంతి నగర్లో నూతనంగా నిర్మించబోయే కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం భవనం శంఖుస్థాపన చేశారు. మారుతి నగర్, రేపాక గార్డెన్స్ ఏరియాలలో నూతనంగా నిర్మించబోయే రెండు వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తిమ్మాపురంలోని ప్రజ్ఞ ఫంక్షన్ హాల్లో, తిమ్మాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టా రిజిస్టర్డ్ దస్తావేజులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ, ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జ్ గుడాల ఏడుకొండలు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్నా జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని కళ్యాణం

ప్రజాశక్తి - సామర్లకోట

పూజలు చేస్తున్న అర్చకులు

స్థానిక భీమేశ్వర స్వామి కళ్యాణోత్సవ పూజలు బుధవారం రాత్రి ఘనంగా సాగాయి. గ్రామోత్సవం అనంతరం ఉత్సవ మూర్తులు ఆలయం వద్దకు చేరుకోగా ఆలయ ఇఒ బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు ఎదుర్కోలు ఉత్సవం, ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం కళ్యాణ పూజలను శాస్త్రోక్తంగా ఆలయ అభిషేక పండితులు, అన్నవరం దేవ స్థానం పండితులు, అర్చకులు నిర్వహించారు. ఈ పూజల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. పూజల్లో మున్సిపల్ కమిషనర్ జె రామారావు, టిడిపి, వైసిపి నాయకులు పట్టణ ప్రముఖులు, భక్త సంఘం నాయకులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ పూజలను తిలకించారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - కోటనందూరు, పెద్దాపురం

కోటనందూరు మండలంలోని బిళ్ళనందూరు గ్రామంలో నవరత్నాలు పథకంలో గుర్తించిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఎంపిపి లగుడు శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో మండలంలో ఉన్న 17 గ్రామపంచాయతీలోనూ రాజకీయ పార్టీల కతీతంగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొత్స సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే కోటనందూరులో సర్పంచ్ గరిసింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, వార్డు సభ్యులు, వలంటీర్లు, గృహసారధులతో సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి శ్రీని వాస్ పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల పాలల్లో సిఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింత కాయల చినబాబు, మండల ఉపాధ్యక్షులు కోరు ప్రోలు రమణమ్మ, ఉప సర్పంచ్ దార్ల సూర్య చంద్ర, వైసిపి నాయకులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామం లో సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ అధ్య క్షతన లబ్ధి దారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను వైసిపి నియోజ కవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొర బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరి బాబు, ఎంపిడిఒ ఉషారాణి, ఇఒపిఆర్‌డి రాజ శేఖర్, మండల వైస్ ప్రెసిడెంట్ మిరియాల రాజా, ఎంపిటిసి సభ్యులు జాగు వీరభద్రరావు, సొసైటి ప్రెసిడెంట్ పళ్ళ గంగారావు, పాల్గొన్నారు.

కొనసాగిన జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ ఆందోళన గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా మాతా శిశు విభాగం నుంచి ఓపి విభాగం వరకూ ర్యాలీ నిర్వహించారు. శానిటేషన్ కార్మికుల ఆందోళనకు జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏసూరి శ్రీను, జిఎస్ఆర్.కృష్ణ, వెంకటేశ్వరరావు, వీరబాబు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, యూనియన్ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ నెల రోజులకు పైగా జిజిహెచ్‌లో కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా కాంట్రాక్టర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్. రమేష్, ఎస్.వాసు, దుర్గాప్రసాద్, ఎం.రవి, శ్రీకాంత్, పుష్ప, కుమారి, అరుణ, శారద, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఇప్పటికే రూ.33 లక్షలతో వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వివరించారు. నీలపల్లి, ఉప్పంగల, తాళ్ళరేవు వన్, పి. మల్లవరం టు గ్రామాల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. తాళ్ళరేవు ప్రజా సంఘాల భవనం వద్దకు వెళ్లే రహదారి సిసి రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు, పటవలలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ. 6 లక్షలు ప్రతిపాదించామన్నారు. ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ మోహనకృష్ణ, ఎంపీటీసీలు, ఇతరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన పాలకులు అవసరం

ప్రజాశక్తి - కోటనందూరు

ఆంధ్ర రాష్ట్రానికి అనుభవజ్ఞులైన పాలకుల అవసరమని టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ యనమల దివ్య అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌అన్నవరంలో, కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు వెళ్లి టిడిపి మేనిఫెస్టోను, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ రాష్ట్రానికి అనుభవజ్ఞుడు, పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబును తిరిగి సిఎంగా తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి వెంకటేష్, అంకమరెడ్డి బుల్లిబాబు, రుతల శ్రీనివాస్, అంకమరెడ్డి గోపి, గాడి రాజబాబు, యనమల శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు, అభిమానులు టిడిపిలో చేరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ సమక్షంలో టిడిపి నాయకులు బచ్చల నాగశివ, జార్జ్‌ల ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. వీరికి ఆమె పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడతూ అందరూ కలిసి పార్టీ కోసం పని చేయాలని, పార్టీలో చేరిన ప్రతీ ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - పెదపూడి

మండల తహశీల్దార్‌గా టి.రాజకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ యు.కొత్తపల్లిలో పనిచేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కులం, ఆదాయ ధ్రువపత్రాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేస్తానని చెప్పారు. విఆర్ఒలు, విఆర్ఎలు, ఇతర సిబ్బందితో సమావేశం అయ్యారు. విధి నిర్వాహణలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటి కృష్ణకుమారి, ఆర్ఐ త్రివేణి, విఆర్ఒలు పి.ఏడుకొండలు, కె.శ్రీనివాసరావు, పసలపూడి దుర్గాప్రసాద్, విఆర్ఎ సత్తిబాబు, జూనియర్ అసిస్టెంట్ మౌనిక పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హక్కు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నవరత్నాలు పథకంలో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వ పాలనలో ఇంటి స్థలంతోపాటు, గృహాలను నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు జడ్‌పిటిసి సభ్యులు బెహరా రాజేశ్వరి, ఎంపిపి గోళ్ళ క్రాంతిసుధాకర్, వైసిపి నాయకులు బెహరా దొరబాబు, వరుపుల సూరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న శివరామకృష్ణపై వైస్ ఎంపిపి వెంకటరమణ, వార్డు సభ్యురాలు దారా పార్వతి ఎంపిడిఒకి ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్ ప్రకారం పంచాయతీలో జరిగే కార్యక్రమాలకు తమను ఆహ్వానించాల్సివుందని, అయితే ఆయన ప్రోటోకాల్‌ను పాటించడం లేదని, ఇటీవల కొత్తపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల శంకుస్థాపన సంబంధిత వార్డు మెంబర్‌కి తెలియపరచలేదని తెలిపారు. హిందూ స్మశాన వాటిక దగ్గర సిసి రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనకు తమకు ఆహ్వానం లేదన్నారు. సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇదే విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా ఆయా శంకుస్థాపనలకు గుమస్తా ద్వారా సమాచారాన్ని ఇచ్చినట్లు తెలిపారు.

కత్తితో యువకుడు హల్‌చల్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మూలపేట సెంటర్లో గురువారం మిట్ట మధ్యాహ్నం ఒక యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. ఆ ప్రాంతంలో తిరిగే ప్రజలు హడలెత్తిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఆ యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఆ యువకుడు పరుగుతీశాడు. అయితే ఆ యువకుడు కోనపాపేట నుంచి వస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆ యువకుడిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ యువకుడు మద్యం సేవించి తన స్వగ్రామమైన మూలపేటకు వచ్చి కత్తి తీసుకుని ఈ విధంగా హల్‌చల్ చేసినట్లు సమాచారం. ఆ ప్రాంతం నుంచి పరారైన ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

అన్నింటా ఆమే...

ప్రజాశక్తి - జగ్గంపేట

అమ్మగా.. అక్కగా...చెల్లిగా.. భార్యగా..ఇలా అన్నింటా ఆమె స్థానం ఎనలేనిది. ఆ స్థానం ఎవరూ భర్తీ చేయలేనిది. అందుకే ఆడదే ఆధారం.. మన కథ ఆడదే ఆరంభం.. అన్నాడో సినీ కవి. మహిళల ఔనిత్యాన్ని పలువురు కవులు తమ కవితల్లో పొందుపర్చారు.నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్నింటా రాణిస్తున్నారు.ఇదే సమయంలో ఇంకా దోపిడీని ఎదుర్కొంటూనే ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఏదొక మూల ఇంకా దాడులు జరుగుతూనే ఉన్నాయి.ఈ నేపథ్యంలో మహిళలతో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి అనే థీమ్‌తో నేడు మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న కొందరి మహిళా మణుల అంతరంగం వారి మాటల్లోనే...

నేటికీ దోపిడీకి గురవుతున్నారు.

దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలైనా మహిళలు నేటికీ దోపిడికి గురవుతూనే ఉన్నారు. గృహిణిగా, శ్రమజీవిగా, ఉద్యోగిగా, ప్రజాప్రతినిధిగా అన్ని రంగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నా సరైన గుర్తింపు లేదు. సమాన హక్కులు, సమాన వేతనాలు దక్కట్లేదు. మహిళల సమానత్వం నాయకుల మాటల్లో తప్ప ఆచరణలో కనిపించట్లేదని చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇంకా కలగానే ఉంది. ఇన్ని సమస్యలున్నా మహిళలను అన్ని రంగాల్లో రాణించి పట్టుదలతో విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని ఆమె తెలిపారు.

- పూర్ణిమ, సిడిపిఒ, జగ్గంపేట

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

ప్రపంచం అభివృద్ధిలో మహిళల పాత్ర ప్రధానమైనది. అటువంటి మహిళపై నేడు దాడులు అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు మహిళల భద్రత కోసం తెస్తున్న చట్టాలపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలి. సమాజంలోని మహిళలపై జరుగుతున్న దాడులపై తోటి మహిళగా స్పందించే తత్వం అలవర్చుకోవాలి. దాడులు జరిగినప్పుడు ప్రతి మహిళ ముందుకు వచి ప్రతిఘటించాలి. అదే మార్పునకు నాంది అవుతుంది.

ఒమ్మి బిందుమాధవి, జడ్‌పిటిసి, జగ్గంపేట

మహిళా సాధికారతకు కృషి చేయాలి

మహిళా లేనిదే సృష్టి లేదు. భూ దేవత సహనం కలవారు మహిళలు. మహిళలు చదువుకుంటున్న ఇంకా ఆశించిన స్థాయిలో గౌరవం పొందడం లేదు. దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిన సమాజంలో ఇంకా మహిళలు వెనుకబడే ఉంటున్నారు. మహిళల ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. మానసికంగా బలంగా ఉండి సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనాలి. అన్ని రంగాల్లో రాణించి మహిళా సాధికారత సాధించాలి. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలి, భారతదేశంలో మహిళకు ఉన్న ఔనత్యాన్ని కాపాడాలి.

- విప్పర్తి రజిని, డిగ్రీ విద్యార్థిని, జగ్గంపేట

రంగం ఏదైనా రాణించడమే లక్ష్యం

రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికి తామేమి తీసుకోమని చాటి చెబుతుంది స్త్రీ శక్తి. నేను వైద్యురాలిగా సేవలందిస్తూ ముందుకు వెళుతున్నాను. ప్రతి స్త్రీ కూడా ఇంటి బాధ్యతతోపాటు సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాలి.

- సౌజన్య, సూపరింటెండెంట్, సిహెచ్‌సి, జగ్గంపేట

మత్స్యకారుల ఖాతాలకు పరిహారం జమ

ప్రజాశక్తి - యానాం



ఒఎన్‌జిసి నుంచి మత్స్యకారులకు జమ చేయాల్సిన పరిహారాన్ని వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధిం చిన వివరాలను వెల్లడించారు. 5289 మందికి ఒక్కొక్కరికీ రూ. 1,72,500లను తమ బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా 15 నెలల పరిహారం ప్రభుత్వం విడు దల చేసిందన్నారు. మిగిలిన 173 మందికి పరిహారం అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఆ సొమ్మును ఏదో ఒక రూపంలో లాక్కోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని, మత్స్యకారులు ఎవరు ఒక్క రూపాయి కూడా ఎవరికి ఇవ్వొద్దని సూచిం చారు. ఆ సొమ్మును తమ కుటుంబానికి మాత్రమే ఉపయోగించాలన్నారు. బ్యాంకుల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశామ న్నారు. ఎవరు ఆందోళన చెందవద్దని తమకు అవసరమైన సొమ్మును మాత్రమే తీసుకుని మిగిలిన సొమ్మును బ్యాంక్‌లో భద్రపరుచు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి, గవర్నర్ తమిళిసై, మత్స్య శాఖ మంత్రి కె.లక్ష్మీ నారాయణన్, ఒఎన్‌జిసి ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల మత్స్యకార నాయకులు, యువకులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఎంఎల్ఎ అశోక్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

నానాజీ గెలుపునకు కృషి : పిల్లి దంపతులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



మాట్లాడుతున్న పిల్లి దంపతులు

టిడిపి, జనసేన పొత్తులో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి పంతం నానాజీ గెలుపునకు కృషి చేస్తామని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులు స్పష్టం చేశారు. గురువారం వారి స్వగృహంలో నానాజీతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని ఓట్లు చీలిపోకుండా టిడిపి జనసేన పార్టీలు పొత్తులో జనసేనకు కేటాయింపు జరిగిందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి తాము కట్టుబడి ఉన్నామని, అందుకే నానాజీ విజయానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. త్వరలోనే తమ ఉమ్మడి అభ్యర్థి విజయానికి ఎన్నికల ప్రచారానికి ఉమ్మడిగా శ్రీకారం చుడతామని అన్నారు. నానాజీ మాట్లాడుతూ కాకినాడ రూరల్ స్థానం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకుడు సత్తిబాబు, అనంతలక్ష్మి, తెదేపా కార్యకర్తలు సహాయ సహకారాలతో ఎన్నికల్లో కలిసి ముందుకు వెడతామన్నారు. జనసేన, టిడిపి కార్యకర్తలు ఒక్కటిగా తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

In the Court of the 7th Additional Junior Civil Judge at Kakinada
I.A. No. 225/2023 in O.S. No. 988/2023

Between:
State Bank of India, Sarpavaram Junction Branch, Kakinada, Rep. by its Branch Manager.
...Petitioner/ Plaintiff
AND
Kapilavai Ramananda Kumar
...Respondent/ Defendant

To:
Kapilavai Ramananda Kumar, S/o. Bala Saraswathy Swami, Hindu, aged 58 years, D.No. 17-24-9, Plot No. 301, Sarada Sadan, Vangaveeti vari Veedhi, Seethampeta, Sriram Nagar, Rajamahendravaram - 533105.

పై నెంబరు దావా మరియు పిటిషన్‌లో ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు మరియు I.A. No. 225/2023 నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 20-03-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మరియు పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

K.V.S.V.LAKSHMOJI RAO
Advocate, Kakinada
Cell: 9866211196

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No. 64/2024

Between:
కర్రి వీర వెంకట సాయిరెడ్డి, S/o. ఆదిరెడ్డి, డోర్ నెంబర్: 3-39, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, పిన్‌కోడ్ 533342. **-వాది**
మరియు
మందరపు మేరీ ఆన్ డిసౌజా అనే మందరపు రిషిక, W/o. నాగేంద్ర శివ శంకర్‌కుమార్, డోర్ నెంబర్: 2-11-4/7, నాగార్జున అపార్ట్‌మెంట్స్, వెంకట్ నగర్, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, పిన్: 533003. **-ప్రతివాది**

పై నెంబరు దావా గ్రంథమునకు గాను ప్రతివాది హాజరు నిమిత్తము మీకు ఎన్నిసార్లు కోర్టు సమన్లు/ నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకముగా సదరు కోర్టు సమన్లు/ నోటీసులను త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 08-04-2024 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావా/పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)

టి.వి.వి.రమణమూర్తి
అడ్వకేట్, దుప్పలపూడి
సెల్: 9652736367 (4)

మహారాజశ్రీ అనపర్తి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. No. 123/2023 in O.S. No. 64/2024

Between:
కర్రి వీర వెంకట సాయిరెడ్డి, S/o. ఆదిరెడ్డి, డోర్ నెంబర్: 3-39, కొప్పవరం గ్రామం, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, పిన్‌కోడ్ 533342. **-పిటీషనర్**
మరియు
మందరపు మేరీ ఆన్ డిసౌజా అనే మందరపు రిషిక, W/o. నాగేంద్ర శివ శంకర్‌కుమార్, డోర్ నెంబర్: 2-11-4/7, నాగార్జున అపార్ట్‌మెంట్స్, వెంకట్ నగర్, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, పిన్: 533003. **-రెస్పాండెంటు**

పై నెంబరు పిటీషనుకు గాను రెస్పాండెంటు హాజరు నిమిత్తము మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యం పూర్వకముగా సదరు కోర్టు సమన్లు/ నోటీసులను త్రిప్పివేయుచున్నారు. కావున **ది. 08-04-2024 ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, లేదా మీ తరపు అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు దావా/పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షంగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది)

టి.వి.వి.రమణమూర్తి
అడ్వకేట్, దుప్పలపూడి
సెల్: 9652736367 (4)

మహారాజశ్రీ అదనపు జూనియర్ సివిల్ జడి వారి కోర్టు, పిఠాపురం
F.D.I.A. No. 2/2023 in O.S. No. 65/2017

బిట్వీన్:
ఈగల కృష్ణ **-పిటిషనరు**
మరియు
ఈగల నాగరాజు మరియు వగైరాలు **-రెస్పాండెంట్స్**

To:
R-3: మురుకుర్తి మంగ, భర్త: నాగరాజు, వయస్సు 44 సం॥లు, గృహిణి, డోర్ నెం. 3-106, అనంతపల్లి గ్రామం, సీతారామపేట కాలనీ, అంబేద్కర్ స్టాట్యూ లైను వీధి దగ్గర, వినాయక ఆర్చి, నల్లజర్ల మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా.

R-4: పక్కుర్తి నేరేళమ్మ, భర్త: శేషారావు, వయస్సు 42 సం॥లు, గృహిణి, డోరు నెం. 3-107, అనంతపల్లి గ్రామం, సీతారామపేట కాలనీ, అంబేద్కర్ స్టాట్యూ లైను వీధి దగ్గర, వినాయక ఆర్చి, నల్లజర్ల మండలం, పూర్వం పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో 3వ మరియు 4వ రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 28-3-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై ఫైనల్ డిక్రీ పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

నక్కిన మల్లిఖార్జునరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9848913888